# డి.డి. గారి. సి.సి.

వేమూరి సుబ్రహ్మణ్యం

"ఆల్‌రైట్. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ ప్రిపేర్ చేసి అరగంటలో బంగళాకు పంపించు" అంటూ డిప్యూటీ డైరెక్టరు నాగరాజు తన ఫియెట్ కారులో ఎక్కి కూర్చున్నాడు. అంత వరకు కారుతలుపు తెరచి పట్టుకొని నిల్చున్న డ్రైవరు "దొరగారు" కారు ఎక్కగానే తలుపువేసి తన సీటులో ఎక్కి కూర్చున్నాడు.

కారుకు కొంచెం యివతలగా నిల్చున్న ఆఫీసు మేనేజరు "యస్ సార్" అన్నాడు సవినయంగా.

కారు బయలు దేరింది.

"ఇహ వెళ్ళి రావయ్యా మొగుడా" అని అనుకొన్నాడు మేనేజరు వెనకాలే నిల్చున్న క్యాంపు క్లార్కు శ్రీరామ చంద్ర మూర్తి.

కారు బయలు దేరటం చూసి మేనేజరూ క్యాంపుక్లర్కు సెల్యూట్ చేశారు. అది అందుకున్న సూచనగా నాగరాజు కొద్దిగా తల ఆడించాడు.

అప్పటిదాకా తలుపుల వెనకా, కిటికీల ప్రక్కనా నిల్చుని నక్కి నక్కి చూస్తున్న ఆఫీసు గుమాస్తాలు కారు వెళ్ళటంచూచి బిల బిలమంటూ బయటి కొచ్చారు.

మేనేజరుకంటే ముందు చకచకా మెట్లెక్కి వరండాలోకొచ్చాడు శ్రీరామ చంద్రమూర్తి. ఒక్కసారిగా అందరూ అతడిని చుట్టుముట్టారు. "ఏమిటి? ట్రాన్స్‌ఫర్లంటున్నాడు?" "ఇక్కడ్నించి ఎవరికి విముక్తి కలిగింది?" "ఇక్కడికి ఎవరిని రప్పిస్తున్నారు....?"

ఇంతమందికి వున్న యిన్ని రకాల ఆదుర్దా చూసి శ్రీరామచంద్రమూర్తి చిద్విలాసంగా చిరునవ్వు నవ్వాడు. "పీడ వదిలింది భాయ్? నన్ను ఏలూరు ట్రాన్స్‌ఫర్ చేశారు...." అన్నాడు.

అందరూ ఒక్కసారిగా నిర్ఘాంత పొయ్యారు.

"నిన్ను ఏలూరు వేశారా? మరి...."

మిగిలిపోయిన ఆ అసంపూర్తి ప్రశ్నకు శ్రీరామచంద్రమూర్తి వెనకాలే వరండాలో కొచ్చిన ఆఫీసు మేనేజరు పురుషోత్తమరావు సమాధానము చెప్పాడు. ఆయన వరండాలో నిల్చుని వున్న ఎస్టాబ్లిష్‌మెంటు క్లార్కు మోహ

